ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

మంగళవారము, మార్చి 20, 2007

12 వ శా. స. IX స. వాల్యూం -- IV నంబరు --4

శక సంవత్సరము - 1928, ఫాల్గుణం - 29

**TUESDAY, THE 20th MARCH, 2007**

**12 L.A. IX S. VOL-- IV No. - 4**

**29 - Phalgun, 1928 - S.E.**

#

శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.


**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్  శాసనసభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | ః | శ్రీ కె. ఆర్. సురేష్ రెడ్డి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | ః | శ్రీ యు . పురుషోత్తమ రెడ్డి<br>శ్రీ బి. వేదవ్యాస్<br>డా. (శ్రీమతి) జి. కుతూహలమ్మ<br>శ్రీ నాదెండ్ల మనోహర్<br>శ్రీ డి.నరేంద్రకుమార్<br>శ్రీ ఎ. గోవింద నాయక్ |
| కార్యదర్శి | ః | శ్రీ  కె. తుల్జానంద్ సింగ్ |
| అదనపు కార్యదర్శి | ః | శ్రీ  కె. గోపాలకృష్ణయ్య |
| సంయుక్త కార్యదర్శులు | ః | శ్రీ ఎస్. రాజ సదారామ్<br>శ్రీ ఎన్. అంజయ్య |
| ఉప కార్యదర్శులు | ః | శ్రీ  డి.శివరావు<br>శ్రీ ఎం. పాండురంగాచార్య<br>శ్రీ ఎం.వి.వి.సత్యానందం<br>శ్రీ పి. సీతారాములు |
| సహాయ కార్యదర్శులు | ః | శ్రీ కె.ఎ.నర్సింహరాజు<br>శ్రీ డి. నర్సింహులు<br>శ్రీ కె. సుభాష్  చంద్రబోసు<br>శ్రీ కె. తులసీరాం<br>శ్రీ డి. సత్యనారాయణ<br>శ్రీ ఎ. రామిరెడ్డి<br>శ్రీమతి వి. గిరిజా సుందరి<br>శ్రీ ఎస్. జయరాం<br>శ్రీ కె. జగన్నాధరావు |
| చీఫ్ రిపోర్టర్ | ః | శ్రీ మహ్మద్ జహీరుద్దీన్ |

--------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
అధికార నివేదిక

( పన్నెండవ శాసనసభ)
( తొమ్మిదవ సమావేశము : ఇరవై రెండవ రోజు )
మంగళవారము, మార్చి **20, 2007**
సభ ఉ. గం. **8.30** లకు ప్రారంభమైనది
( గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు )

----------

## విషయ సూచిక

**1.** సభా కార్యక్రమము

వాయిదా తీర్మానముల గురించి

**2.** సంతాప తీర్మానము

శాసనసభ మాజీ స్పీకర్ శ్రీ జి.నారాయణరావు గారి మృతిపట్ల

----

## సభా కార్యక్రమము

### వాయిదా తీర్మానముల గురించి

మిస్టర్ స్పీకర్ : గౌరవ శాసన సభ్యులందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు. Adjournment Motions have been received today.

1. Adjournment Motion given notice of by Sri E.Dayakar Rao garu and others regarding the alleged leakage of Intermediate question papers adversely affecting the interests of students, is disallowed.

2. Adjournment Motion given notice of by Dr. G.Vijaya Rama Rao garu and others regarding the measures to be taken to protect the interests of sugarcane farmers by paying minimum support price for sugarcane and to take over the NDSL as per the recommendations of the House Committee, is disallowed.

3. Adjournment Motion given notice of by Sri Nomula Narsimhaiah garu and others regarding the alleged leakage of Intermediate question papers by the Lecturers and staff of a College in Hayathnagar, Ranga Reddy district, is disallowed.

4. Adjournment Motion given notice of by Sri Chada Venkat Reddy garu and others regarding the need to enhance the freedom fighters pension of the State Government on par with the Central Government, is disallowed.

5. Adjournment Motion given notice of by Sri G.Kishan Reddy garu regarding the alleged leakage of Intermediate question papers adversely affecting the interests of students, is disallowed.

As all the Adjournment Motions have been disallowed, I request the Hon'ble Members to use the option of coming up in a different Rule, so that these would be adopted and taken up.

## సంతాప తీర్మానము

### శాసనసభ మాజీ స్పీకర్ శ్రీ జి. నారాయణరావు గారి మృతిపట్ల

డా. వై.యస్. రాజశేఖర్ రెడ్డి : అధ్యక్షా, నిన్న రాత్రి మాజీ అసెంబ్లీ స్పీకర్ శ్రీ జి. నారాయణరావు గారు మృతి చెందారు. ఆయన మృతి పట్ల హౌస్ సంతాపం వ్యక్తపరచవలసిన అవసరముంది. ఇంతకు ముందు నాకు తెలిసినంత వరకూ హౌస్ ఇన్ సెషన్‌లో వున్నప్పుడు మాజీ ముఖ్యమంత్రి విజయభాస్కరరెడ్డి గారు చనిపోయినప్పుడు ఆరోజు హౌస్ ఎడ్జర్న్ అయింది. అదే ఆనవాయితీగా మాజీ ముఖ్యమంత్రి గారు చనిపోయినప్పుడు, వారికి సంతాపం తెలిపి హౌస్ ఎడ్జర్న్ చేసినప్పుడు, అదే పద్ధతి మాజీ స్పీకరుకు కూడా సెషన్ వున్నప్పుడు చేస్తే బాగుంటుందనే ఫీలింగ్ నాకు వుంది. I request you to take the opinion of other Opposition leaders also.

Mr.SPEAKER: As Leader of the House, ముఖ్యమంత్రి గారి ప్రపోజల్. ఎందుకంటే హౌస్ సెషన్‌లో వున్న సమయంలో మాజీ స్పీకరు గారు శ్రీ జి. నారాయణరావు గారు మృతి చెందారు కాబట్టి వారి కండోలెన్స్ మోషన్, వారి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి, వారి మోషన్ మువ్ అయిన తరువాత Adjourning

the House for the day would be befitting tribute to him. So, I will take up the Condolence Motion first.

డా. వై.యస్. రాజశేఖర రెడ్డి : మాజీ అసెంబ్లీ స్పీకర్ శ్రీ జి. నారాయణ రావు గారు నిన్న సాయంత్రం హైదరాబాదులో మృతి చెందారు, పరమపదించారు. నారాయణరావు గారు మంచి మానవతావాదిగా ముద్ర వేసుకున్నారు. 1985-89 మధ్య కాలంలో స్పీకరుగా సమర్థవంతముగా పనిచేసిన నారాయణ రావు గారు, ఈ రాష్ట్రం మనకు అందించిన ఉత్తమ అసెంబ్లీ స్పీకర్‌లలో ఒకరు. ఆయన ఇక్కడ స్పీకరుగా వున్నప్పుడు నేను కూడా ప్రతిపక్షంలో వుండే అవకాశం నాకు వచ్చింది. ఆయన మానవతావాది. అంటే ప్రతి విషయంలోను బాగా సెన్సిటివ్‌గా ఫీలయ్యేవారు. ఎప్పుడూ కూడా ఏ ఒక్కరినీ కూడా నొప్పించే ప్రయత్నం, పరిస్థితి రానిచ్చేవారు కాదు. ఆయన అంతకు ముందు న్యాయవాదిగా వుండి, తరువాత రాజకీయాలలోకి ప్రవేశించిన వ్యక్తి. బార్ అసోసియేషన్‌లో అధ్యక్ష పదవిని చేపట్టారు. ఆయన హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న కాలంలో పేదలకు బాగా ఉచితంగా న్యాయ సలహాలు కూడా ఇచ్చేవారని పేరు కూడా వుండేది. కరీంనగర్ జిల్లా, జగిత్యాల మండలం, తిమ్మాపూర్ గ్రామంలో జన్మించిన నారాయణ రావు గారు అనేక సాంఘిక సేవా కార్యక్రమాలలో కూడా పాల్గొన్న వ్యక్తి. రాజకీయాలలో తక్కువ కాలం వున్నా, పేద, బడుగు, బలహీన వర్గాలు ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశారు. ఆయన ఆత్మబంధు పేరిట ఒక కమ్యూనిటీ సర్వీస్‌ను, బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేసి అవసరమైనంత వరకూ తనదైన పద్ధతిలో సాంఘిక సేవలో కూడా వున్నారు. ఆయన మృతి పట్ల ఈ సభ తీవ్రమైన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున, ఈ సభ తరపున సానుభూతి వ్యక్తం చేయాలని కోరుతున్నాను.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (కుప్పం) : అధ్యక్షా, మాజీ స్పీకరు శ్రీ జి. నారాయణరావు గారు చనిపోవడం చాలా బాధాకరం. ఒక మంచి రాజకీయ నాయకుడిని కోల్పోవడం జరిగింది. నారాయణ రావు గారు హైకోర్టు అడ్వొకేట్‌గా వుండడం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేయడం జరిగింది. నేను జనరల్ సెక్రటరీగా వున్నప్పుడు, మొట్టమొదటిసారిగా నాకు బాగా జ్ఞాపకం ఆయన ఆసిఫ్‌నగర్‌లో పోటీ చేయడం. ఆ ఎలక్షన్‌లో నేను ఆయనతో కలిసి చాలా సన్నిహితంగా పనిచేశాను. ఆ తరువాత 1985లో మహారాజ్‌గంజ్‌లో పోటీ చేసి పెద్ద మెజారిటీతో గెలవడం, 1985 నుండి 1989 వరకు ఆయన స్పీకరుగా వున్నారు. అదే మాదిరిగా నేను జనరల్ సెక్రటరీగా వున్నప్పుడు చూశాను ఒక వ్యక్తిత్వం వున్న వ్యక్తి నారాయణ రావు గారు. ఎక్కడా కూడా, దేనికీ కూడా భయపడకుండా ఆయన ఏది న్యాయమనుకుంటే దాని ప్రకారం పనిచేసిన వ్యక్తి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా యన్.టి. రామారావు గారు వున్నప్పుడు కూడా హౌస్‌లో మీరు లేకపోవచ్చు గాని, మీరు వినే వుంటారు. చాలా హుందాగా ప్రవర్తించి, ఏదైనా వచ్చినప్పుడు ఏ విధంగా ప్రవర్తించాలో ఆ ఛైర్‌కి వన్నె తెచ్చే విధంగా ప్రవర్తించేవారు. 1989 వరకు ఆయన స్పీకరుగా వున్నప్పుడు నేను చూశాను. ప్రతిపక్షం గాని, అపోజిషన్ గాని అనే వివక్షత లేకుండా అందరినీ సమానంగా చూసుకుంటూ హౌస్‌ను ఒక హుందాతనంగా నడిపిన వ్యక్తి నారాయణరావు గారు. ఆ తరువాత అనేక రాజకీయ డెవలప్‌మెంట్స్ రావడం జరిగింది. అయితే అప్పుడప్పుడూ నేను కలిసేవాడిని. కలిసినప్పుడు కూడా ఆయన ప్రవర్తించిన తీరు చూస్తే చాలా హుందాగా వుండేది. అలాంటి వ్యక్తి నిన్న అనారోగ్యంతో, సోమవారం రాత్రి ఒక ప్రయివేటు హాస్పిటల్‌లో చేరడం, ఆ ప్రయివేటు హాస్పిటల్‌లో ఆయన చనిపోవడం జరిగింది. ఇది ఒక విధంగా చెప్పాలంటే ఒక మంచి నాయకుడిని ఈ రాష్ట్రం కోల్పోవడం జరిగింది. అదే మాదిరిగా ఒక డిగ్నిటీకి గాని, హుందాతనానికి గాని ఆయన ఒక ప్రత్యేక వ్యక్తి. అలాంటి నాయకుడిని కోల్పోవడం మన సభకు తీరని నష్టం. రాష్ట్రానికి నష్టం. మంచి వ్యక్తిని కోల్పోవడం

పట్ల తెలుగుదేశం పార్టీ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు మన ప్రగాఢ సానుభూతిని తెలియజేసుకుంటూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

శ్రీ నాయని నర్సింహారెడ్డి (ముషీరాబాద్)ః అధ్యక్షా, నారాయణ రావు గారు మృతిచెందడం చాలా విచారకరం. ఆయన హైదరాబాదు నగరంలో క్రిమినల్ లాయర్‌గా చాలా పేరు పొందినటువంటి వ్యక్తి. ఆయన హైదరాబాదు నగర బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా వున్నారు. రాష్ట్ర బార్ అసోసియేషన్‌కి వైస్-ప్రెసిడెంట్‌గా వున్నారు. చాలా ధైర్యశాలి. ఆయన 1985 నుండి స్పీకరుగా వున్నారు. వారు స్పీకరుగా వున్నప్పుడు నేను శాసనసభలో సభ్యుడిగా వున్నాను. వారు 1969లో ప్రత్యేక రాష్ట్రం కొరకు చెన్నారెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణా రాష్ట్రం ఏర్పాటును ఆయన చేపట్టి పెద్ద పోరాటంలో పార్టిసిపేట్ చేశారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు కావాలని ఆయన చివరి నిమిషం వరకూ ఆకాంక్షతో పని చేశారు. పార్టీ నిరోధక చట్టాన్ని కూడా ధైర్యంగా అసెంబ్లీలో వారు ఇక్కడ అమలు చేశారు. వారు చాలా గొప్ప వ్యక్తి. ప్రజా పోరాటంలో చాలా చురుకైన పాత్ర వహించి బడుగు, బలహీన వర్గాలకు, వెనుకబడిన వర్గాలకు వారు న్యాయం చేశారు. చాలామంది నగరంలో వున్న వారికి ఫీజులు లేకుండా, వారు ఫ్రీగా కొట్లాడి, వారికి న్యాయం కల్పించే ప్రయత్నం చేసినటువంటి వ్యక్తి. 1969లో ఆయన వెంట పనిచేసే అవకాశం దొరికింది. టిఆర్‌యస్., పెట్టినప్పుడు కూడా వారు వచ్చి యాక్టివ్‌గా పనిచేశారు. ఈ మధ్య అనారోగ్యంతో ఇనాక్టివ్‌గా అయిపొయ్యారు. చాలా గొప్ప వ్యక్తి. వారి యొక్క మరణం చాలా దిగ్భ్రాంతిని కలుగజేసింది మాకు. వారు లేని లోటు మాకు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి నష్టం జరిగింది. వారి యొక్క మరణానికి మేము తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చుతూ, వారి యొక్క కుటుంబానికి మా యొక్క సానుభూతిని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.
ఉ.8.40

శ్రీ యం.ఏ. గఫూర్ (కర్నూలు) ః అధ్యక్షా, చాలా మంది పెద్దలు చెప్పినట్లుగా నారాయణ రావు గారు ఒక ప్రత్యేకమైనటువంటి వ్యక్తిత్వంతో తనదైన శైలితో, రాజకీయాలలో వున్నది తక్కువ కాలం అయినా రాజకీయాల మీద ఒక ప్రత్యేక ముద్ర వేశారు. ఆయన స్పీకరుగా వున్నప్పుడు మేము ఇక్కడ లేకపోవడం, మరి మాకు అదృష్టం లేదు. ఇక్కడ లేకపోయినప్పటికీ బయటి నుండి చూసేవారము. చాలా హుందాగా, సభ యొక్క గౌరవాన్ని పెంచే పద్ధతిలో నారాయణరావు గారు నిర్ణయాలు తీసుకునేవారు. ఆ రకంగా స్పీకరుగా తనకంటూ ప్రత్యేకమైనటువంటి ముద్ర ఆయనకు వుంది. తరువాత రాజకీయాలలో, చురుకైన రాజకీయాలలో పాల్గొనక పోయినప్పటికీ ఇటీవలి కాలంలో ఆయన అనారోగ్యంతో నిన్న రాత్రి చనిపోయినట్లు తెలిసింది. మా పార్టీ తరపున ఆయన మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. ఆయన కుటుంబానికి మా సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ చాడా వెంకట రెడ్డి (ఇందుర్తి)ః అధ్యక్షా, మాజీ స్పీకర్ నారాయణ రావు గారు నిన్న రాత్రి అనారోగ్యంతో మరణించడం హృదయవిదారకరమైన సంఘటనగా మేము భావిస్తున్నాను. వారితోబాటు కలిసి పనిచేసే అవకాశం లేకపోయింది. వారు 1985 నుండి 1989 వరకూ స్పీకరుగా ఇక్కడ పనిచేసినటువంటి తీరుతెన్నులు, వారు ఇక్కడ స్పీకరుగా వుండి నిర్వహించినటువంటి నిర్వహణ తీరుతెన్నులు, నిర్మొహమాటంగా వ్యవహరించేటటువంటి పరిస్థితులలో హుందాతనంగా వ్యవహరించే స్థితిగతులు, నిక్కచ్చిగా వ్యవహరించే తీరు ఇవన్నీ కూడా మేము తెలిసికొన్నాము, విన్నాము. ఏదైనా అయినప్పటికీ కూడా వారు స్పీకరుగా వున్న పదవీ కాలంలో శాసన సభను వారు సరైనటువంటి పద్ధతిలో నిర్వహించేటటువంటి వ్యక్తిగా, అంతకంటే వారు

అడ్వకేట్‌గా, బార్ అసోసియేషన్‌కి సంబంధించి వారు అధ్యక్షులుగా వుండి, ఉచితంగా న్యాయం చేకూర్చడంతోబాటు బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారంలో వారు వారి వంతు బాధ్యతను నిర్వహించి, కృషి చేసిన వ్యక్తి. పేద ప్రజలతో మమైకమైనటువంటి వ్యక్తి. వారు మా కరీంనగర్ జిల్లా జగిత్యాల మండలం తిమ్మాపూర్ గ్రామ నివాసస్తులు. వారి గురించి కొంత సమాచారం తెలిసినప్పటికీ, వారి మృతిపట్ల సిపిఐ., శాసనసభా పక్షం తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తుంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తుంది.

جناب سیّد احمد پاشاہ قادری۔ مسٹر جی۔نارائن راؤ کے انتقال کی خبر سن کر بہت ہی حیرت ہوئی۔ وہ ایک مرتبہ شہر حیدر آباد کے حلقۂ مہاراج گنج سے 1985ء میں بحیثیت ایم۔ایل۔اے۔نمائندگی کر چکے تھے۔ اس کے بعد حلقۂ آصف نگر سے بھی مقابلہ کئے تھے۔ جی۔نارائن راؤ صاحب ایک ممتاز قانون داں تھے اور وہ اس اسمبلی کے اسپیکر کے فرائض بھی بخوبی انجام دیئے تھے اس سے سب لوگ بخوبی واقف ہیں۔ دواخانوں میں بھی وہ غریب لوگوں کی بہت مدد کرتے رہے۔ مجلس اتحادالمسلمین پارٹی کی طرف سے میں اُن کے افرادِ خاندان کے ساتھ اظہارِ ہمدردی کرتا ہوں۔

---

శ్రీ జి. కిషన్ రెడ్డి (హిమాయత్‌నగర్) : అధ్యక్షా, నారాయణరావు గారు వయస్సులో గాని, రాజకీయాలలో చాలా పెద్దవారు అయినప్పటికీ వారు కొన్ని రోజులు బిజెపి.,లో పనిచేయడంతో నేను పార్టీ ఆఫీసు ఇన్‌ఛార్జ్‌గా వుండడంతో వారితో నాకు చాలా వ్యక్తిగతమైనటువంటి సంబంధం వుంది. వారి యొక్క పర్సనాలిటీ గాని, వారి యొక్క వాణి గాని లేకపోతే ముక్కుసూటిగా, నిక్కచ్చిగా, నిబద్ధతతో వ్యవహరించేటటువంటి వారియొక్క విధానం గాని, అన్నింటికంటే మించి అన్ని విషయాల పైన వారికి వున్న అవగాహన గాని, స్పీకరుగానే కాదు, బయట రాజకీయాలలో గాని లేకపోతే అనేకమైనటువంటి విషయాలు చర్చకు వచ్చినప్పుడుగాని, వారంటే భయం, భక్తి, అభిమానం కూడా వుండేది. బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఎక్కువగా పెట్టమని నన్ను ఎక్కువగా ప్రోత్సహించేవారు. మీ యువకులందరూ కూడా రక్తదాన శిబిరాలు పెట్టాలి. ఆ రకంగా పేద ప్రజలను ఆదుకోవాలనేలని మనలను ఎంకరేజ్ చేసినటటువంటి వ్యక్తి. ఇటీవల మా పార్టీ అధ్యక్షులు రాజ్‌నాథ్ సింగ్ గారు హైదరాబాదుకు వచ్చినప్పుడు, రెండు నెలల క్రితం అందరితో కలసి రాజ్‌నాథ్‌సింగ్ గారితో మాట్లాడినప్పుడు కూడా తెలంగాణా పైన ఈ రాష్ట్రంలో తెలంగాణా ఏర్పాటు కావాలని చెప్పినటువంటి వ్యక్తి, స్పష్టమైన అవగాహన వున్న వ్యక్తి. గతంలో ముఖ్యమంత్రిగా యన్.టి. రామారావు గారు వున్నప్పుడు అయోధ్య విషయంలో, రామజన్మభూమి విషయంలో చాలా స్పష్టంగా మాట్లాడి, లౌకికవాద విషయంలో సరైన అవగాహనతో మాట్లాడినటువంటి వ్యక్తి, అసెంబ్లీలో మాట్లాడిన వ్యక్తి చాలా రోజులుగా వారు అనారోగ్యంతో వున్నారు. అనారోగ్యంతో వున్నప్పటికీ కూడా ఎప్పుడు కలిసినా కూడా ఈ దేశం గురించి, సమాజం గురించి చాలా స్పష్టమైన అభిప్రాయాలతో మాట్లాడే వ్యక్తి. ఆ రకమైనటువంటి వ్యక్తి నిజంగా మనలను ఈ రోజు విడిచి వెళ్లడం అనేది మన రాష్ట్రానికి, రాజకీయాలకు చాలా లోటు. వారి కుటుంబ సభ్యులకు నేను బిజెపి., పార్టీ తరపున ప్రగాఢమైన సానుభూతిని వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.8.50

శ్రీ డి.శ్రీనివాస్‌ః  అధ్యక్షా, శ్రీ జి.నారాయణరావుగారి మరణవార్త ప్రొద్దున పత్రికల్లో చూడగానే చాలా బాధ కలిగింది.  నారాయణరావుగారు ఈ రాష్ట్రంలో తనకంటూ ఒక మార్కును ఏర్పాటుచేసి వెళ్లిపోయారు. నారాయణరావు  మార్కు వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారనేది నా అనుభవం.   నాకు విద్యార్థి దశనుంచి వారితో సంబంధం ఉండేది.  మొట్టమొదటిసారి ఒక చిన్న కేసులో ఆయన వద్దకు వెళ్లడం జరిగింది. అప్పుడుడు  వారు  కుత్బీగూడలో ఉండేవారు.  మొదటిసారి వారిని చూడగానే నాకు చాలా భయం వేసింది. ఎందుకంటే ఆయన పర్సనాలిటీ, మీసాలు, ముఖ్యంగా వారి కంఠం .  కానీ వారితో మాట్లాడిన తరువాత వారు మాట్లాడే తీరు, ఆయన పద్ధతి, వారు మానవతా దృక్పథంతో చూసే తీరు చూస్తే  చాలా గౌరవం కలిగేది. ఆయన ఆఫీసు గదిలో గోడకు లెనిన్‌ గారి ఫోటో ఉండేది.   నేను రెండవసారి ఆయనను కలవడానికి వెళ్లినప్పుడు వారిని మీరు కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారా అని అడిగితే, శ్రీనివాస్‌ అలా ఎందుకు అడుగుతున్నావని నారాయణరావుగారు తిరిగి నన్ను అడిగారు.  మీరు లెనిన్‌గారి ఫోటో గోడకు పెట్టారు కదా అని అంటే శ్రీనివాస్‌ నాకు కమ్యూనిస్టు పార్టీతో సంబంధం లేదు, అలాగే నేను ఏ రాజకీయ పార్టీకి చెందినవాడను కాదని చెప్పారు.  లెనిన్‌గారి పద్ధతులు ఎందుకో నచ్చాయి,   ఒక స్నేహితుడు ఇచ్చినందుకు అక్కడ పెట్టానని చెప్పారు.  వారు ఒక అడ్వకేట్‌గా పనిచేసే సమయంలో కూడా చాలా మానవతా దృక్పథంతో పనిచేశారు. స్పీకర్‌గా ఉన్న సమయంలో కూడా అదే విధంగా పనిచేశారు.

వారు స్పీకర్‌గా ఉన్న  సమయంలో  నేను సభలో సభ్యుడిగా లేకపోయినప్పటికీ వారిని గమనించే అవకాశాలు నాకు వచ్చాయి.   వారి హుందాతనం, పత్రికల్లో వారి వ్యవహారం చూస్తుంటే, ఆయా సందర్భాల్లో వారు చేసిన కామెంట్స్‌ చూస్తుంటే రాష్ట్రంలో ఆయనలాంటి స్పీకర్‌ ఇంకెవరైనా ఉన్నారా అని ఆలోచించినట్లయితే అది వాస్తవంగా కొంచెం కష్టమున్న విషయం తెలిసింది.   ఎందుకంటే మా చిన్నతనంలో ఉన్న స్పీకర్ల విషయం నాకు  ఎక్కువ తెలియదు.  వారు రాజకీయాల గురించి ఫెడ్‌ అయి, రాజకీయాలనుంచి దూరమయ్యారు.  ఆ తరువాత కూడా వారికి నాకూ ఉన్న కామన్‌ ఫ్రెండ్స్‌ ద్వారా అప్పుడప్పుడూ కలిసేవారం .   వారు పెద్దవారైనప్పటికీ, వయసులో నేను చిన్నవాడినైప్పటికీ వారిని కలిసినప్పుడు వారు నాకు చాలా మంచి సలహాలు చెప్పేవారు.  చాలా నిర్మొహమాటంగా చెప్పేవారు.  ఈ విషయంలో వారి గురించి తెలుగుదేశం పార్టీవారికి ఎక్కువ తెలియాలి.   వారు ఎన్టీ రామారావుగారితో కూడా చాలా నిర్మొహమాటంగా చెప్పేవారని, ఎన్టీ రామారావుగారితో నిర్మొహమాటంగా మాట్లాడగలిగేవారిలో నారాయణరావుగారు ఒకరని తెలుసు.  ఆయన ఎవరికీ భయపడేవారు కాదు.  ఏ విషయమైనా చాలా ధైర్యంగా చెప్పగలిగే ధైర్యం వారికి ఉండేది.  ఏ రాజకీయ పార్టీ అయినా, ప్రభుత్వమేదైనా, ఎవరైనా ఆయన పద్ధతి అలా ఉండేది.    నాకు విద్యార్థి దశనుంచి వారితో ఉన్న సంబంధం వల్ల ఆయననుంచి కొన్ని విషయాలు  నేర్చుకున్నాను.   కొన్ని కారణాల వలన ఆయన రాజకీయాలనుంచి దూరమైన తర్వాత అయినా, అటువంటి వారి సేవలు మనం ఉపయోగించుకోవాలి.  వారి సలహాలు మనం తీసుకుంటే ఎంతో బాగుంటుందని నా  భావన.  ఏ పార్టీ ప్రభుత్వమైనా, ఎవరైనా అటువంటి సలహాలు తీసుకొని ఉంటే చాలా మంచిదని నా భావన.  కానీ ఆయన జీవించి ఉన్నంత కాలం మహోన్నత వ్యక్తిగా, మానవతా వాదిగా, ముక్కుసూటిగా మాట్లాడుతూ చివరకు ఆయన రాజకీయాలనుంచి రిటైర్‌ అయిన తరువాత కూడా ప్రజలకు ఏదో ఒక విధంగా సేవ చేయాలనే నిర్ణయం తీసుకొని ఒక బ్లడ్‌ బ్యాంక్‌ను గానీ,

అంబులెన్స్‌ను గానీ ఏర్పాటుచేసి చాలా పెద్ద ఎత్తున ప్రజలకు సేవ చేశారు. వారు ఏర్పాటుచేసిన ఆత్మబంధువు చాలా పాపులర్ అయింది. ఇప్పుడు అటువంటి సంస్థలు చాలా వచ్చాయి గానీ అప్పుడు అటువంటివి లేవు. పుట్టిన ప్రతి మనిషి చనిపోవలసిందే, తప్పదు. కానీ, ఈ రోజు ఉదయం వారి మరణవార్త వినగానే చాలా బాధ కలిగింది. నాకే కాదు, పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలవారు వారి మరణవార్త తెలియగానే బాధపడినవారున్నారు.

అటువంటి వ్యక్తి చనిపోవడం పట్ల, వారితో నాకున్న అనుబంధం మాత్రమే కాకుండా, నా తరుపున, మా ముఖ్యమంత్రిగారి తరపున, మా పార్టీ తరపున ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చి వారి కుటుంబీకులకు ఇవ్వాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి.జనార్ధనరెడ్డి (ఖైరతాబాద్): అధ్యక్షా, ఈ శాసనసభకు శ్రీ నారాయణరావుగారు 1985 నుంచి 1989 వరకు స్పీకర్‌గా ఉన్నారు. వారు స్పీకర్‌గా ఉన్న సమయంలో కూడా నేను శాసనసభ్యుడిగా ఉన్నాను. వారు సభను ఎంతో చక్కగా, ధైర్యంగా నడిపేవారు. నాకు ముందు మాట్లాడినవారు చెప్పినట్లు వారు న్యాయవాదిగా పనిచేశారు. వారు కరీంనగర్‌లో జన్మించి, హైదరాబాదులో లాయర్‌గా ప్రాక్టీసు చేస్తూ ఆయనవద్దకు పేదవారు కేసుల విషయంలో వెళ్లినప్పుడు వారి దగ్గర లేకపోయినా కూడా వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కోర్టులో ఫైల్ చేసే కాగితాలకు గానీ, టైపింగ్ ఛార్జీలకు గానీ ఆయన సొంతంగా ఖర్చుపెట్టి కేసులు వాదించేవారు. వారు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు.

తరువాత వారు తెలంగాణా ప్రజా సమితిలో చెన్నారెడ్డిగారి నాయకత్వంలో వారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంకొరకు 1969లో చాలా పెద్దఎత్తున ఆందోళన చేయడం జరిగింది. ఆ ఆందోళనలో సుమారు 350 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఆ కేసులను వారు ఎంతో శ్రద్ధ తీసుకొని వాదించడం జరిగింది. వారు తెలుగుదేశం పార్టీలో చేరి 1985లో మహరాజ్‌గంజ్ నియోజకవర్గంనుంచి అత్యధిక మెజారిటీతో శాసనసభ్యులుగా ఎన్నిక కావడం జరిగింది. వారి ఏకైక పుత్రుడు యాక్సిడెంట్‌లో చనిపోయారు. వారు సభాధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడు చాలా హుందాగా కనిపించేవారు. పాలకపక్షమైనా, ప్రతిపక్షమైనా సభ్యులందరికీ సమానావకాశాలు ఇస్తుండేవారు. పాలకపక్షంనుంచి ఏదైనా తప్పులున్నట్లయితే గట్టిగా మందలించేవారు. వారు అంత గట్టిగా అధ్యక్ష స్థానంలో ఉండి వ్యవహరించారు కాబట్టే తెలుగుదేశం పార్టీ 1989 ఎన్నికల్లో వారికి టిక్కెట్ ఇవ్వలేదు. తెలుగుదేశం పార్టీ వారికి టిక్కెట్ ఇవ్వకపోయినా కూడా వారు తరువాత ప్రజల కొరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. నిమ్స్ హాస్పిటల్ నుంచి కొంత స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లీజుకు తీసుకొని అక్కడ బ్లడ్ బ్యాంక్‌ను, ఆపద్బంధు అంబులెన్స్‌ను ఏర్పాటుచేశారు. అటువంటి వ్యక్తి ఈ రోజు మన మధ్య లేనందుకు, స్పీకర్‌గా ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చినందుకు వారి ఆత్మకు శాంతి కలగాలనీ కోరుకుంటూ, వారి కుటుంబానికి ధైర్య సాహసాలు ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వై.రామకృష్ణుడు (తుని): అధ్యక్షా, శ్రీ జి.నారాయణరావుగారు అధ్యక్ష స్థానంలో ఉండగా శాసనసభ్యునిగా ఉండే అవకాశం నాకు కూడా కలిగింది. వారు అధ్యక్ష స్థానానికి హుందాతనాన్ని తీసుకరావడమే కాకుండా, ఎంతో డిగ్నిఫైడ్‌గా, డీసెన్సీ అండ్ డెకోరమ్ మెయింటెన్ చేసిన మంచి డైనమిక్ పర్సనాలిటీ. ఏది ఏమైనప్పటికీ, శాసనసభకు సంబంధించినంతవరకు రూల్స్ మీద గాని, రెగ్యులేషన్స్ మీద

గానీ, ట్రెడిషన్స్ మీద కానీ వారికి మంచి అవగాహన ఉండడమే కాకుండా, సరైన రూలింగ్స్ ఇవ్వడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం వారికున్న ప్రత్యేకత. అదే విధంగా నారాయణరావుగారితో నాకు ఎక్కువ కాలం పరిచయం లేకపోయినప్పటికీ కూడా ఆయన జీవిత చరిత్రను కనుక చూసినట్లయితే వారు ఒక విప్లవాత్మకమైనటువంటి ఆలోచన కలిగిన వ్యక్తి అని తెలుస్తుంది. ఆ ఆలోచనతో వారు ఉద్యమాలలో పాల్గొనడమే కాకుండా తరువాత కూడా సామాజిక సేవ చేయాలన్న దృక్పథం కలిగిన గొప్ప వ్యక్తి. వారు న్యాయవాదిగా ఉన్నప్పుడు ఒకవైపు డిగ్నిఫైడ్ అండ్ డైనమిక్‌గా ఉండడమే కాకుండా సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో లీగల్ ఎయిడ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద కక్షిదారుల కేసులు ఫీజు తీసుకోకుండా ఉచితంగా చేపట్టి నిర్వహించిన మానవత్వం కలిగిన వ్యక్తి. రాజకీయాలనుంచి విరమించుకున్న తర్వాత కూడా వారు సమాజానికి సేవ_ చేయాలనే ఉద్దేశంతో బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటుచేసి దాని ద్వారా పేద రోగులకు సేవ చేయాలనే ఉద్దేశంతో శ్రమించిన వ్యక్తి. అటువంటి గొప్ప వ్యక్తి ఈరోజున మన మధ్య లేకపోవడం చాలా దురదృష్టకరం, బాధాకరం . వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.9.00

శ్రీ పి. రామయ్య (నిడమోలు) : అధ్యక్షా, మాజీ స్పీకర్ శ్రీ జి. నారాయణరావుగారి మరణ వార్తను విని దిగ్భ్రాంతి చెందాను. సభా నాయకులు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టడం ముదావహం. 1985లో నేను తొలిసారిగా ఎన్నికై ఇక్కడకు వచ్చాను. వారు గంభీరవర్ణుడు. నాబోటి వాళ్లకు చాలా ఇబ్బందిగా ఉండేది. ఈ బిల్డింగ్‌లోకి రాకముందు పాత అసెంబ్లీ భవనంలో మూడు నెలలు పాటు సమావేశాలు జరిగాయి. అప్రాప్రియేషన్ బిల్లు మీద మాట్లాడమని చెప్పారు. నేను మాట్లాడుతున్నాను. ఎవరూ లేరు సభలో. 30, 40 మంది కంటే ఎక్కువ లేరు. నేను అడిగాను--సార్, గోడలకు చెప్పమంటారా, కుర్చీలకు చెప్పమంటారా అని అడిగాను. ఆయన నవ్వి ఎవరికీ చెప్పొద్దు, నాకు చెప్పు , కోరం, ఉంది మీ స్పీచ్ రికార్డు అవుతుంది చాలు అన్నారు. అదొక మరపురాని సంఘటన. ఆ తర్వాత ఈ భవనంలోకి వచ్చిన తరువాత కూడా నేను బ్యాక్ బెంచీల్లో ఉండే వాడిని. ఆ సీటులో కూర్చొన్న వారికి బ్యాక్ బెంచీల్లో ఉండే వారి పట్ల చూపు అంత తొందరగా పడదు. అందువల్ల ఒకసారి నాకు అవకాశం రాకపోతే, పలుసార్లు చేయి ఎత్తినా అవకాశం రాకపోతే, బెంచి ఎక్కాను. ఏమి చేయాలి? స్పీకర్‌గారు కూర్చోమని పదే పదే చెప్పితే, కూర్చొన్నాను. ఆ తర్వాత వారి చాంబర్స్‌కు రమన్నారు. వెళ్లాను. ఎందుకు అలా చేశావు అని అడిగారు. బ్యాక్ బెంచీల్లో కూర్చొన్న నేను మీ ఆకర్షణను అందుకోలేకపోతున్నాను, అందుకే అలా చేశానని చెప్పాను. ఆ తర్వాత నుండి వారు బ్యాక్ బెంచీల్లో కూర్చొనే సభ్యులకు కూడా అవకాశాలు ఇవ్వడం మొదలుపెట్టారు. అది కూడా ఒక మరవలేని సంఘటన. అదే విధంగా దేవాలయ భూములకు సంబంధించి చర్చ జరిగే సందర్భంలో కూడా మేము కొంచెం అల్లరి చేశాము. కొంత ముందుకు రావడానికి ప్రయత్నం చేశాము. కావలి కళాశాల విషయంలో ఇక్కడ వివాదం వచ్చినపుడు, మేము చెప్పింది న్యాయం అనుకున్నందుకు గాను, మేము కొంత అల్లరి చేశాము. నాతోపాటు జక్కా వెంకయ్యగారు కూడా దూసుకుని వచ్చే ప్రయత్నం చేశారు. అప్పుడు నారాయణరావుగారు అన్నారు--మీరు ఇక్కడ వరకు రానక్కర్లేదు, మీరు మీ స్థానాల్లో నిలబడితే చాలు, అప్పుడు హౌజ్ ఆర్డర్‌లో లేనట్లే లెక్క అని చెప్పి సర్దుబాటు చేశారు.

నా జ్ఞాపకాల్లో ఇంకొక సంఘటన ఏమిటంటే, భూ సమస్య మీద నేను నెల రోజులపాటు జైలులో ఉన్నాను. రాఘవరెడ్డిగారు ఇక్కడ ఉన్నారు. వారు స్పీకర్‌గారికి చెప్పారు-- ఒక పక్క ఇక్కడ సమావేశాలు

జరుగుతుంటే, సభ్యుడు ఇక్కడ లేకపోవడం ఏమిటని అడిగితే, రెండు, మూడు రోజుల్లో రప్పిస్తాను నారాయణరావుగారు హామి ఇచ్చారు. అయితే ఆయన ఆ విధంగా రప్పించలేకపోయారు. అప్పుడు వసంత నాగేశ్వరరావుగారు హోమ్ మినిస్టర్‌గా ఉన్నారు. ఆయన్ని పిలిపించారు. అప్పుడు హోమ్ మినిస్టర్‌గారు, ముఖ్యమంత్రితో మాట్లాడి తీసుకుని వస్తానని చెప్పారు. అయితే నాకు వర్తమానం రాలేదు. నేను ఇక్కడకు రాలేదు. కారణం ఏమిటని స్పీకర్‌గారు విచారిస్తే, నా మీద క్రిమినల్ కేసులు ఉన్నాయని చెప్పారంట. ఆ తర్వాత నేను వచ్చిన తర్వాత, పిలిపించి నువ్వు మంచి పని చేశావు, బేయిల్ తీసుకోకుండా, సమస్య పరిష్కారం కొరకు నువ్వు అక్కడే ఉండి, ఒక శాసనసభ్యుడిగా కృషి చేశావని నన్ను ప్రోత్సహించారు. కొత్తగా వచ్చిన శాసనసభ్యుల్ని వారు ఆ విధంగా ప్రోత్సహించేవారు. మాట్లాడేందుకు అవకాశం ఇచ్చేవారు. వారితో నాకు ఉన్న జ్ఞాపకాలు మరచిపోలేనివి. మంచి స్పీకర్‌గా పని చేసిన వారిని కోల్పోవడం చాలా నష్టదాయకం. వారి మృతి పట్ల సంతాపం తెలియచేస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి. సూర్యారావు : స్పీకర్‌సార్, నారాయణరావుగారు స్పీకర్‌గా ఇక్కడ పనిచేసినపుడు, నేను మొట్టమొదటసారిగా ఈ సభకు శాసనసభ్యుడిగా వచ్చి, వారి యొక్క విధి నిర్వహణను, ఈ రాష్ట్ర ప్రగతి పట్ల వారికి ఉన్న ఆలోచనల్ని నేను నిశితంగా గమనించేవాడిని. రాత్రి వారి మరణ వార్త తెలిసిన వెంటనే ఆ రోజుల్లో వారితో నాకు ఉన్న సాన్నిహిత్యం జ్ఞాపకం వచ్చింది. మాకు అప్పుడు పెద్దగా అనుభవం లేకపోయినా, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల నుండి వచ్చిన శాసనసభ్యులకు మాట్లాడేందుకు వారు అవకాశం ఇస్తుండేవారు. వారికి ఉన్న రాజకీయ మెళకువలు, విలువలు ఒక్కసారి నిన్న రాత్రి గుర్తుకు వచ్చి, నేను కూడా బాధకు లోనయ్యానని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

వారు స్పీకర్‌గా ఉన్న రోజుల్లో ఒకటికి రెండు సార్లు, మూడు సార్లు సభ్యులుగా పనిచేసిన బాగారెడ్డిగారు, కుడిపూడి ప్రభాకర్‌రావుగారు, అదే విధంగా కమ్యూనిస్టు పార్టీకి చెందిన బోడేపూడి వెంకటేశ్వరరావు గారు, నర్రా రాఘవరెడ్డిగారు, అదే విధంగా ఈనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిగారు, జె.సి. దివాకర్‌రెడ్డిగారు, సమర సింహారెడ్డిగారు వంటి పెద్దలు ఈ హౌజ్‌ను ఏ విధంగా అయినా స్టాల్ చేయాలని ప్రయత్నించినపుడు, ఈ సభను ఏ విధంగా అయినా సరే నడిపించాలనే పట్టుదలతో నడిపించేవారు. సభా సాంప్రదాయాల్ని గౌరవించటంలో వారు మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించేవారు. వారికి ఉన్న దూరదృష్టిని ఈనాటి శాసనసభ్యులందరూ నేర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అటువంటి మహానాయకుడు మరణించడం విచారకరం. ముఖ్యంగా ఈ కొత్త అసెంబ్లీ భవనం నిర్మించిన తర్వాత, ఆ సీటులో కూర్చొన్న మొట్టమొదటి సభాపతి నారాయణరావుగారే. వారి లేని లోటు తీర్చలేనిది. వారికి ఈ విధంగా సభ ప్రారంభం కాగానే నివాళులు అర్పించడం సభ యొక్క హుందాతనానికి, వారి పట్ల మనకు ఉన్న గౌరవాన్ని, విశ్వాసాన్ని ఇనుమడింప చేస్తోంది. రాజకీయాల్లోనే కాకుండా, వారు అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొని, ప్రజలకు సేవ చేశారు. వారి యొక్క మృతి పట్ల సంతాపం తెలియచేస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ, సభా నాయకులు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

శ్రీ ఎ. గోవింద నాయక్ (ఖానాపూర్) : అధ్యక్షా, నారాయణరావుగారి మృతితో నాకు పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయి. నారాయణరావుగారి మరణ వార్త ఈరోజు పేపర్లో చూశాను. మా ఊరికి గోదావరి నదే అడ్డం. 1974లో నేను ఎల్.ఎల్.బి పాస్ అయ్యాక, నా పేరెంట్స్ నన్ను అడ్వకేట్‌ను చేయాలన్న ఉద్దేశ్యంతో

తిమ్మాపూర్‌లో నారాయణరావుగారి ఇంటికి తీసుకుని వెళ్లారు. మా పేరెంట్స్, " దొర, మా కొడుకు లా పాస్ అయ్యిండు, వకీలు చేద్దామనుకుంటున్నాము " అని చెప్పగానే ఆయన పకపక నవ్వేశాడు. " ఏంటి, ఎందుకు నవ్వుతున్నాడు, మా గిరిజనులు వకీలు పని చేయకూడదా" అని అనుకున్నాను. నా ముఖాన్ని చూసి, ఆయన అర్థం చేసుకుని, " నేను నవ్వింది నన్ను దొర అన్నందుకు, అంతే తప్ప వేరే కారణం కాదు, మీరు వకీలుగా ప్రాక్టీస్ చేయకూడదనే భావంతో నవ్వలేదు " అని అన్నారు. 1974 నుండి 1985 వరకు హైకోర్టులోనూ, సిటీ సివిల్ కోర్టులోనూ వారు నాకు అన్ని విధాల సహాయసహకారాలందించారు. గిరిజనుల సమస్యల గురించి, ఏజెన్సీ ఏరియాల గురించి అర్థం కాకపోతే, వారు గంటల తరబడి నాతో చర్చించేవారు. ఆ తర్వాత 1985లో వారూ, నేను ఒకేసారి అసెంబ్లీకి వచ్చాము. వారు స్పీకర్‌గా అక్కడ కూర్చొన్నారు. నేను ఇక్కడకు రాగానే ఆయన మీసాలు, ఇగో మీ ప్రక్కన ఇప్పుడున్న ఈ మీసాల వాడిని చూసి భయపడే వాడిని. నారాయణరావుగారి ఠీవి మరవలేనిది.

ఉ.9.10

(ఈ దశలో గౌ.సభ్యులు కొద్దిసేపు లంబాడ భాషలో మాట్లాడారు)

నేను ఏమి చెపుతున్నానంటే, 1985లో బడ్జెట్ మీద తొలిసారిగా మాట్లాడే అవకాశం కల్గింది. అప్పుడు నేను లంబాడ భాషలో మాట్లాడాను. అయినా, వారు నన్ను ఎక్కడా ఆపలేదు. ఆ తర్వాత వారు నన్ను వారి ఛాంబర్స్‌లోకి పిలుచుకుని, నాయక్‌గారు " మీరు లంబాడ భాషలో మాట్లాడి, నేను లంబాడ వాడినని చెప్పుకోవడానికి సిగ్గుపడలేదు. మీరు ధైర్యంగా లంబాడ భాషలో మాట్లాడటం ఎంతో గర్వ కారణం. మీలాంటి వారికి మేము ఉన్నాము, మిమ్మల్ని పూర్తిగా ఎంకరేజ్ చేస్తాము " అని వారు ఎంతో ప్రోత్సాహం కల్పించారు. వారు తెలంగాణ వాది. వారి ఆత్మకు శాంతి చేకూరాలంటే,ఈరోజు ప్రత్యేక తెలంగాణ కోసం తీర్మానం సభలో ప్రవేశపెట్టవలసిందిగా కోరుతూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. నమస్కారం.

డా.జి. విజయరామారావు (స్టేషన్ ఘనపూర్) : స్పీకర్ సార్, రాష్ట్ర శాసనసభ మాజీ సభాపతి స్వర్గీయ నారాయణరావుగారు గొప్ప వ్యక్తిత్వం ఉన్న మహా మేధావి. వారు స్పీకర్‌గా ఈ సభలో అత్యున్నతమైన సభా సాంప్రదాయాల్ని సభలో అందరూ పాటించాలని ఆదేశించేవారు. ఆదేశించడమే కాకుండా, వారు సభాపతిగా మంచి సాంప్రదాయాల్ని ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం గుర్తు పెట్టుకోగలిగే విధంగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా మిగిలిపోయే విధంగా వ్యవహరించిన వ్యక్తి. వారు స్పీకర్‌గా వ్యవహరించిన తీరుతెన్నులు, తీసుకున్న విధాన నిర్ణయాలు ఎవరూ కూడా మరచిపోలేరు. స్పీకర్‌గా ఎంపిక అయిన తరువాత పాలకపక్ష కనుసన్నుల్లోనే మెలగవలసిన అవసరం లేదు, స్వతంత్ర వ్యక్తిగా శాసనసభ నిబంధనలకు అనుకూలంగా వ్యవహరించాలని ఆయన ఋజువు చేశారు. వారు అయిదు సంవత్సరాలుపాటు స్పీకర్‌గా కొనసాగి, తర్వాత, 1989లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వారికి ఆనాడు వారి పార్టీ టిక్కెట్టు ఇవ్వలేదంటే, దానికి కారణం, స్పీకర్‌గా ఆయన ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించకపోవడం వల్లనే. అయితే నారాయణరావుగారికి ఆనాడు ఏ పార్టీ టిక్కెట్టు ఇచ్చింది? శాసనసభ స్పీకర్‌గా ఆయన ఉన్నప్పుడు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కొంత మంది శాసనసభ వైపు దూసుకుని వచ్చిన సందర్భంగా ఏ పార్టీ వారినైతే జైలుకు పంపారో, ఆ పార్టీయే ఆయనకు టిక్కెట్టు ఇచ్చింది. ఆ విధంగా కాంగ్రెస్ పార్టీయే మళ్లీ వారికి టిక్కెట్టు ఇచ్చిదంటే, వారి యొక్క నిష్పక్షపాతమైన విధాన నిర్ణయాల్ని చూసి, ఆనాటి ప్రతిపక్షం కూడా వారికి, టిక్కెట్టు ఇచ్చి ఆదరించింది. రాజీవ్‌గాంధీగారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పార్టీ మార్పిడి నిరోధక చట్టం అమల్లోకి తీసుకుని రాబడింది. ఆ చట్టం రాష్ట్ర శాసనసభకు కూడా వర్తిస్తుంది. ఆ విశేషాధికారాల్ని ఉపయోగించుకుని, ఈనాటి కాంగ్రెస్ శాసనసభ్యులు రామచంద్రారెడ్డిగారిని,

ఆనాడు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సభ్యుడిగా ఉండి, కాంగ్రెస్ పార్టీ తరఫున ఆనాడు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఉన్న అతన్ని నారాయణరావుగారు శాసనసభ నుండి సస్పెండ్ చేశారు. ఆ విధంగా వారు అనేక నిర్ణయాల్ని నిష్పక్షపాతంగా, నిర్భయంగా, చట్టానికి అనుకూలంగా, శాసనసభా సాంప్రదాయాలకు అనుకూలంగా వ్యవహరించి, అపారమైన గౌరవ, మర్యాదల్ని పొందారు. ఇంతకు ముందు పెద్దలు చెప్పారు. చెన్నారెడ్డి కాలంలో వారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కొరకు వారితో కలసి విశేషంగా కృషి చేయడమే కాకుండా, తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించే సందర్భంగా మా పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్‌తో అనేక సమావేశాలు నిర్వహించారు. పార్టీ యొక్క రాజ్యాంగాన్ని, నియమావళిని తయారుచేయడంలో వారు మాకు అనేక సందర్భాల్లో గైడ్ చేశారు, సలహాలిచ్చారు. తర్వాత, టి.ఆర్.ఎస్. పార్టీ ఉద్యమం కొనసాగుతున్న సందర్భంలో కూడా మాతోటి, మా అధ్యక్షులవారితోటి అనేక సందర్భాల్లో, బహిరంగ సభల్లో తెలంగాణలోని అనేక జిల్లాల్లో తిరిగి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు యొక్క ఆవశ్యకత గురించి నొక్కి చెప్పిన మహానుభావుడు. వారు రాజకీయపరంగానే కాకుండా, సామాజికపరంగా కూడా పేద, దళిత వర్గాల పక్షాన నిలిచి, నిష్పక్షపాతంగా వ్యవహరించడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా వారి పక్షాన నిలబడి, న్యాయ్యవాద వృత్తి ద్వారా అనేక సేవలు అందించారు. నారాయణరావుగారు ఈ రాష్ట్ర రాజకీయాల్లో చిరస్మరణీయులు. అటువంటి వ్యక్తిత్వం గల్గిన నారాయణరావుగారు మృతి చెందడం పట్ల నిజంగా మా టి.ఆర్.ఎస్. పక్షాన మేము బాగా చింతిస్తున్నాము. వారి కుటుంబానికి మనో నిబ్బరాన్ని కల్గించాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకుంటూ, నేను సెలవు తీసుకుంటున్నాను.

ఉ. 9.20

శ్రీ కె. జానారెడ్డి: అధ్యక్షా, నారాయణరావు గారికి నాకు చాలా అవినాభావ సంబంధం, ఆత్మీయతానుబంధం వున్న సంగతి చాలామంది సభ్యులకు తెలుసు. 1985లో వారియొక్క స్పీకర్ అభ్యర్థిత్వానికి మేమంతా మద్దతు మద్దతు యివ్వడంతోబాటు దానికి తగిన వ్యక్తిగా వారిని నేను బలపరచాను. ఆనాటి నుండి ఆయన నాకు వ్యక్తిగతంగా అనేక సలహాలు యివ్వడంతోబాటు , ప్రజా సమస్యల పరిష్కారానికి నాకు తోడుగా వుండడమే కాకుండా నన్నెంతో ప్రోత్సాహించేవారు. వారిలో వున్నటువంటి విశిష్టత, విలక్షణత మొదలైన ఉత్తమ గుణాలను గురించి , సభను నడిపిన తీరు గురించి యిప్పుడే సభ్యులందరూ తెలియజేశారు. నేను మరలా వివరాలతో తెలియజేయవలసిన అవసరం లేదు. ఆయన ఈసభకు వన్నె తేవడంతోబాటు, సభాపతిగా హుందాగా, మంచి కమేండ్‌తో ఈసభను నడిపి ఉత్తమ స్పీకర్‌గా ప్రఖ్యాతి గాంచారు. ఆయన రాబోయే స్పీకర్స్‌కు కూడా స్ఫూర్తిని కలిగించే ఆదర్శాలు కలిగిన వ్యక్తి. వివిధ రంగాలలో ఆయన సేవలు చేస్తూ అనేక మంది యొక్క అభిమానాన్ని, మన్ననలను పొందినటువంటి పెద్దమనిషి. ఈ తరుణంలో ఆయన మరణం అత్యంత విషాదకరం . వారం రోజుల క్రితం ఆయన టెలిఫోన్‌లో నాతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం వున్న పరిస్థితులను గురించి , రాష్ట్రాభివృద్ధి గురించి మాట్లాడడానికోసం నన్ను గంట సమయం అడిగారు. మొన్న రాత్రి ఆయన నన్ను పలుసార్లు జ్ఞాపకం చేసుకున్నారనే విషయం నేను తెలుసుకున్నప్పుడు ఆయనకు నాపై వున్న ఆత్మీయతను గుర్తు చేసుకున్నాను. మిగతా వివరాలు సభ్యులు చెప్పారు. మీ అందరికీ తెలుసు. ఆయన మరణం పట్ల నా విషాదాన్ని, బాధను వ్యక్తపరుస్తూ వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శ్రీ జె. రత్నాకరరావు (బుగ్గారం): అధ్యక్షా, నేను, నారాయణరావు గారు యిద్దరం కూడా ఒకే గ్రామానికి చెందిన వారము. యన్‌టి రామారావు గారి ప్రభుత్వంలో వారు సభాపతిగా ఎన్నికైన సందర్భాన్ని వారు నాకు తెల్పి నన్ను కూడా తన వెంట తీసుకుపోవడం జరిగింది. ఆయనను సభాపతిగా యన్. టి. రామారావు గారు ప్రకటించిన తరువాత ఐదు సంవత్సరాలు వారు మంచి స్పీకర్‌గా పేరు తెచ్చుకున్నారు. నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా, ఆనాటి రజాకార్స్‌కు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మేమంతా అండర్‌గ్రౌండ్‌కు పోయినాము. ఆ తరువాత వారు హైదరాబాదుకు వచ్చి పట్టభద్రులై హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. ఇప్పుడు వారికి మా గ్రామంలో మిగిలిన ఆస్థి ఇల్లు మాత్రమే. వారు వారం రోజులుగా అన్‌కాన్షస్‌గా వున్నారు. అనుకోకుండా గత రాత్రి ఎనిమిదిన్నర గంటలకు వారు చనిపోవడం జరిగింది. మేమంతా ఒకే కుటుంబానికి చెందిన వారము కాబట్టి వారికి వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలిలియజేస్తున్నాను. వారు నాకంటే 3 సంవత్సరాలు పెద్ద. వారికి యిప్పుడు 81 సంవత్సరాల వయసు వుంది. వారికి యిద్దరు కుమారులు వున్నారు. వారికి , వారి కుటుంబానికి నా సానుభూతిని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి భగవంతుడు సహకరించాలని కోరుతూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యం. సత్యనారాయణరావు (కరీంనగర్): అధ్యక్షా, ఇప్పుడే మిత్రుడు రత్నాకరరావు చెప్పినట్లు నారాయణరావు గారు మా జిల్లాకు, రత్నాకరరావు గారి గ్రామానికి చెందినవారు. ఆయన మాకు దగ్గర బంధువు. వారి నాయనమ్మ, మా అమ్మమ్మ స్వంత అక్కాచెల్లెళ్లు. నేను చిన్నతనం నుండి వారి దగ్గరే వుండేది . మాకు దగ్గర సంబంధం వుండేది. ఆయనకు క్రిమినల్ లాయర్‌గా చాలా పేరు వుండేది. మేము చదువుకునే రోజుల్లో స్టూడెంట్ యూనియన్‌లో వున్నప్పుడు వారు చక్కగా ఆర్గనైజ్ చేసేది. ఎప్పుడైనా, ఏదైనా బలగం కావాలంటే అతని క్లయింట్స్ ధూల్‌పేట్‌లో వుంటే, వారు సహాయం చేసే వారు. మేము చదువుకునే రోజుల్లో ధూల్‌పేట్ పహిల్వాన్లకు చాలా ఫేమస్. మాకు ఆయనతో సత్సంబంధాలు వుండేవి. చిన్నతనం నుండి మేము దగ్గరగా వున్నాము. అన్నిటికంటే ముఖ్యం, తెలంగాణా మూమెంట్‌లో చెన్నారెడ్డి గారి నాయకత్వంలో మేమంతా యాజిటేషన్ చేసినప్పుడు మాతోబాటు వారు పాల్గొనడమే కాకుండా జైలుకు కూడా వచ్చారు. మేమంతా జైళ్లలో వుంటిమి . మీ అందరికీ తెలుసు అప్పుడు వందేమాతరం రామచంద్రరావు అనే ఫ్రీడం ఫైటర్ వుండే వారు. ఆయనకు నారాయణరావుగారితో సన్నిహిత సంబంధం వుండేది. ఆయన తెలంగాణా మూమెంట్‌లో పాల్గొన్నా ఒక పార్టీని పట్టుకొని ప్రాకులాడింది లేదు. తెలుగుదేశం పార్టీ వచ్చిన తరువాత ఆ పార్టీలో చేరారు. తరువాతబ సభాపతి అయినారు. ఆయనకు అప్పుడు అనుభవం లేదు, ఫేమస్ క్రిమినల్‌లాయర్‌గా వుండె. అప్పుడు మదన్ మోహన్ లీడర్ ఆఫ్ ది అపోజిషన్ వుండె. నారాయణరావు గారు హౌస్‌ను హుందాగా నడిపి, సభాపతిగా మంచిపేరు తెచ్చుకున్నారు. యన్.టి. రామారావు వంటి వ్యక్తిని కూడా గజగజా వణికించారు. నేను చెప్పకూడదు కాని యన్. టి. రామారావు గారు ఆయన యింటికి పోయిన సంగతి నాకు తెలుసు. స్పీకర్ అంటే ఏమిటో నిరూపించిన వ్యక్తి నా వుద్దేశంలో నారాయణరావు గారు ఒక్కరే. ఆ విధంగా సభను బ్రహ్మాండంగా నడిపి సభకు, తనకు మంచి పేరు తెచ్చారు. అటువంటి వ్యక్తి ఈమధ్య అనారోగ్యంపాలైనారు. ఆయన జానారెడ్డికి చాల దగ్గర మిత్రుడు. ఆయన, జానారెడ్డి పదిహేను రోజులకు ఒకసారైనా కలిసే వారు. వారి మధ్య చాలా సన్నిహిత సంబంధం వుండె. మంచి ధైర్యవంతుడు, సాహసవంతుడైన వ్యక్తిని మనం కోల్పోవడం బాధాకరం . ఏది ఏమయినప్పటికీ వారు ఎంతో హుందాగా సభను నడిపారు. వారిని ఉదాహరణగా తీసుకొని కొంతమంది సభను నడుపుకోవలసిన అవసరం వుంది. నాకు తెలిసినంతవరకు వారు హౌస్‌లోబ అందరినీ సమానంగా చూస్తూ సభను నడిపిన వ్యక్తి ఆయన. భగవంతుడు

వారి ఆత్మకు శాంతిని ప్రసాదించాలని, వారి కుటుంబానికి మనశ్శాంతిని కలిగించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. రోశయ్య: అధ్యక్షా, సభా నాయకుడు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను కూడా బలపరుస్తూ వున్నాను. నారాయణరావు గారు చదువుకునే రోజుల్లో విద్యార్థి నాయకుడుగా కానీయండి, న్యాయవాదిగా కానీయండి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వారు. అలాగే శాసనసభాపతిగా తనకు ప్రత్యేక గుర్తింపును సముపార్జించుకున్న వారు. నైజాం వ్యతిరేక పోరాటంలో , ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన వారు. నా దృష్టిలో ఎక్కడున్నా మొదటి పది మందిలోఒకరుగా వుండడానికి ప్రయత్నించేవారు. ఎప్పుడు వెనుకబడి వున్నామనిపించుకునే వారు కాదు. వారికి 81 సంవత్సరాలు అయినా, ఆరోగ్యవంతునిగా వుంటే మరికొంత కాలం జీవించే అవకాశం వున్న వారు. వారు మరణించడం ఈ రాష్ట్ర ప్రజానీకానికి బాధాకరమైన విషయం . వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. నారాయణరావు కుటుంబసభ్యులు వారి మరణం వల్ల కలిగిన దుఃఖాన్ని దిగమింగి వారు చూపించిన బాటలో నడిచే ఆలోచనా శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.**9-30**

**MR. SPEAKER :** This House places on record its deep sense of sorrow at the demise of Sri G. Narayana Rao Garu, former Speaker of AP Legislative Assembly and conveys a deep sense of sympathy to the Members of bereaved family.

I associate myself with the sentiments expressed by the Hon'ble Chief Minister, Leader of the Opposition, Floor Leaders and other Members of this House.

Sri G. Narayana Rao Garu was born on 24th June, 1931 at Timmapur village, Jagatyal Mandal, Karimnagar Dist. During his student days he fought against Nizam's Rule. He was Vice-Chairman of Bar Council of AP High Court for three terms. He was President of the Bar Association of City Civil Court. He was elected to the AP Legislative Assembly in 1985 from Maharajgunj Constituency of Hyderabad Dist. and served as the Speaker from 1985 to 1989. He contributed to the House and he conducted the House in dignified manner and enhanced its prestige and honour. He attended several Commonwealth Parliamentary Conferences. He gave a number of rulings of far reaching importance.

He is survived by three daughters. He passed away on 19th March, 2007 at the age of 76.

Let us observe a two-minute silence as a mark of respect to the departed soul.

**(The entire House then stood up and observed a two minute silence as a mark of respect to the departed soul)**

MR. SPEAKER : Now, the House is adjourned to meet again at 8-30 AM tomorrow.

**(The House then adjourned at 9-34 AM to meet again at 8-30 AM on Tuesday, the 21st of March 2007)**